ఈ వారం ఈశీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ :
శ్రీ యర్రంశెట్టి శాయి



ఈ డిటెక్షన్ కథలకు గెస్ట్ ఎడిటర్‌గా ఉండటంకన్న బుద్ధితక్కువ పని ఇంకోటి లేదని తెల్సింది. కిందటివారం గెస్ట్ ఎడిటర్ కథలు చూశాను. చాలా అద్భుతంగా ఉన్నాయ్. (మరి మల్లాదిగారు నన్ను చిత్రహింసలు పెట్టటానికే ఇలాంటి ఏర్పాటు చేశారా అని ఓ చిన్న డౌట్) ఏదేమయినా నూటికి 98 చెత్తకు పోగా మిగిలిన రెండు మటుకు మంచివి దొరికాయ్!

ఇవిగాక బాగున్నవి కేవలం అయిదో, ఆరో- అంత ఘోరంగా ఉన్నాయ్ కథలు మొత్తంమీద! ఇక పోతే నా గురించి నాకంటే పాఠకులకే ఎక్కువ తెలుసు గనుక ఏమీ రాయటంలేదు—

# "దోషికిదండన తప్పదు"

డిటెక్టివ్ యుగంధర్ ఆఫీసులో టెలిఫోన్ మ్రోగింది.

అసిస్టెంటు రాజు రిసీవర్ ఎత్తుకున్నాడు.

అవతలి వైపు నుంచి చెప్తున్నది విని, "అలాగే. వెంటనే అక్కడికి వస్తున్నాము యిద్దరం." అని ఫోన్ పెట్టేసి యుగంధర్ వైపుతిరిగి, "ప్రొఫెసర్ సచ్చిదానందగారు ఆత్మహత్య చేసుకున్నారట. ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు ఫోన్ చేసాడు. తను అక్కడికి వెళుతున్నాడట. మనల్ని వెంటనే రమ్మన్నాడు." అని చెప్పాడు. వెంటనే యిద్దరూ తయారయి బయలుదేరారు. ఫ్రిజ్లర్ కారు రాజు డ్రైవ్‌చేస్తున్నాడు. యుగంధర్ రాజు ప్రక్కనే కూర్చొని దీర్ఘాలోచనలో మునిగిపోయాడు. ఐదు నిముషాల్లో కారు సచ్చిదానందం బంగళాచేరింది. అప్పుడు సమయం రాత్రి పదయింది. బంగళాలో లైట్లన్నీ వెలుగుతున్నాయి. కారు పోర్టికాలో ఆపాడు రాజు. పోలీస్‌వ్యాన్, అంబులెన్స్ అప్పటికే వున్నాయి అక్కడ. కారు దిగి బంగళాలోనికి ప్రవేశించారు యుగంధర్, రాజు. వీరిద్దరినీ చూస్తూనే సెల్యూట్‌చేసి మేడమీది ప్రొఫెసర్ గదిలోకి తీసుకెళ్ళాడు ఒక కానిస్టేబుల్!

బెడ్‌మీద వుంది ప్రొఫెసర్ సచ్చిదానందం శవం! దీర్ఘంగా నిద్రలోవున్నట్లుంది ఆయన ముఖం. మంచం పక్కనే మందు సీసా!

"ఇప్పుడే డాక్టర్ శవపరీక్షచేసివెళ్లాడు. ఈ సీసాలో అతి ప్రమాదకరమైన విషం చొట్లు మిగిలివున్నాయి. ఆ విషం తీసుకోవడంవల్లనే ప్రొఫెసర్‌గారు మరణించారు. ప్రొఫెసర్‌గారి సతీమణి సరళాదేవి సినిమా నుండి తిరిగివచ్చేసరికి భర్తశవం కనుపించిందట. వెంటనే నాకు ఫోన్ చేసారు." అని చెప్పాడు ఇన్‌స్పెక్టరు స్వరాజ్యరావు డిటెక్టివ్ యుగంధర్‌తో!

ఆ తర్వాత ముగ్గురూ కలిసి ప్రక్క రూమ్‌లోకి వెళ్ళారు. ఆ రూమ్‌లో బెడ్‌మీద పడుకొని వెక్కివెక్కి రోదిస్తున్నది సరళాదేవి. ఆమెను చూస్తూనే ఆశ్చర్యపోయాడు యుగంధర్! ఆమె వయస్సు పాతికేళ్ల లోపే! యాభైఏళ్ళ ప్రొఫెసర్‌గారికి యింత అందమైన పడుచు భార్య!

"చూడండి సరళాదేవి గారూ! మీ బాధను అర్థంచేసుకోగలము. మీకు మా హృదయపూర్వక సానుభూతి. ఇలాంటి సమయంలో కూడా మా ప్రశ్నలతో మిమ్మల్ని విసిగిస్తున్నానని అనుకోకుండా, మాతో సహకరించగలరని కోరుతున్నాను." అన్నాడు డిటెక్టివ్ యుగంధర్!

సరళాదేవి కళ్ళు తుడుచుకొని, "ఫర్వాలేదు. అడగండి."అన్నది. ఏడ్చిఏడ్చి ఆమె కళ్ళు ఎర్రగావున్నాయి. ముఖం ఉబ్బిపోయి వుంది.

"ఆత్మహత్య చేసుకోవలసిన అవసరం మీవారికేముంది?"

"ఆయన చాలా కాలంగా కడుపులో నొప్పితో బాధపడుతున్నారు. ఒక్కోసారి ఆ నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుంటాను అంటూవుండేవారు. కాని నిజంగా యిలా చేస్తారనుకోలేదు."ఏడుస్తూ చెప్పింది సరళాదేవి.

"అసలు ఏం జరిగిందో చెప్పగలరా?" మళ్ళీ అడిగాడు యుగంధర్!

"ఈ రోజు మామూలుగా ఐదు గంటలకు ల్యాబ్‌నుండి వచ్చారు. సినిమాకు వెళదాం రమ్మని అడిగాను. తను ఏదో రిపోర్ట్ తయారుచేసుకోవాలని, నన్ను వెళ్ళిరమ్మని చెప్పారు. నేను సినిమానుంచి వచ్చేటప్పటికి యీ ఘోరం జరిగిపోయింది." వెక్కిళ్ళ మధ్య అన్నది సరళాదేవి.

"ఏ సినిమాకు వెళ్లారు మీరు?..."యధాలాపంగా అడిగాడు యుగంధర్!

"దేవదాసు. పాత చిత్రం. ప్రభాత్ టాకీస్‌లో! సినిమా పూర్తికాగానే నేరుగా ఇంటికి వచ్చాను."అన్నది.

"మీరేమీ అనుకోకపోతే సినిమాటిక్కెట్టు ముక్క వుంటే యిస్తారా?" అని అడిగాడు.

ఆశ్చర్యంగా యుగంధర్ని చూసి హ్యాండ్ బ్యాగ్‌లో నుంచి కౌంటర్‌ఫాయిల్ తీసిచ్చింది సరళాదేవి. ఏదో ఆలోచిస్తూవుండిపోయాడు యుగంధర్!

"ప్రతిరోజూ మీ వారు కడుపు నొప్పికి మందువాడుతుంటారా?"

"అవును. ఫ్రిజ్‌లో ఆ సీసా వుంటుంది. రోజూ నేనే యిస్తూవుంటాను. ఇవ్వాళ నేను లేనిసమయం చూసి ఆ సీసాలో పొటాషియమ్ సైనేడ్ కలుపుకుని త్రాగేశారుఆయన" అని చెప్పింది.

ఆ తర్వాత ఏవో మరికొన్ని ప్రశ్నలడిగి శవాన్ని మార్చురీకి పంపించే ఏర్పాట్లు చేసి బయలుదేరారు యిన్‌స్పెక్టర్, డిటెక్టివ్‌లు యిద్దరూ!

మరుసటి రోజు రాజును ఒక పని మీద పురమాయించాడు యుగంధర్! సాయంత్రానికంతా రిపోర్టు తయారు చేసుకొచ్చాడు రాజు! ఆ రిపోర్టులో వివరాలు చూసి ఆశ్చర్యంలో మునిగిపోయాడు యుగంధర్! కేసు మబ్బులావిడిపోసాగింది.

రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో ప్రొఫెసర్‌గారి బంగళా ముందు ఆగాయి పోలీస్‌వ్యాన్ మరియు ఒక ఫ్రిజ్లర్‌కారు.

పోలీస్‌వ్యాన్ నుండి ఇన్‌స్పెక్టరు స్వరాజ్య రావు, క్రిస్లర్‌కారునుండియుగంధర్,రాజు దిగి బంగళాలోనికి ప్రవేశించారు.

వీరిని చూస్తూనే ఆశ్చర్యంగా, "రండి" అంటూ ఆహ్వానించింది సరళాదేవి.

"క్షమించండి సరళాదేవి గారూ! మీ భర్త సచ్చిదానందగారిని విషప్రయోగంతో హత్యచేసినందుకు మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాను."అన్నాడు ఇన్‌స్పెక్టర్ స్వరాజ్య రావు. అవాక్కాయిపోయింది సరళాదేవి. ఆమె ముఖం పాలిపోయింది.

"కాని...కాని...హత్యజరిగే సమయానికి నేనక్కడలేను. సినిమాకు వెళ్ళి పదిగంటల ప్రాంతాన వచ్చాను." అన్నది ధృఢంగా!

"హత్యాసమయంలో నువ్వక్కడ లేక పోయినా ఈ హత్యచేసింది నువ్వే."చెప్పాడు డిటెక్టివ్ యుగంధర్ సరళాదేవితో.

ఆ తర్వాత కొద్దిసేపట్లో నిజం వప్పుకొని లొంగిపోయింది సరళాదేవి.

మరుసటిరోజు సాయంత్రం యుగంధర్ యింట్లో టీ త్రాగుతూ, "సరళాదేవి యీ హత్యచేసిందని ఎలా వూహించారు మీరు?" అని ప్రశ్నించాడు స్వరాజ్యరావు.

"తన భర్త పొటాషియంసైనేడ్ విషం తీసుకుని మరణించాడని చెప్పింది సరళాదేవి. తనభర్త ఏం విషం తీసుకున్నది ఆమెకెలా తెలుసు? ఆ విషంపేరు మనకూ తెలియదు. డాక్టర్‌రిపోర్టులోగాని అది బయట పడదు.అప్పుడే నా అనుమానం ఆవిడమీదకు మళ్ళింది. దేవదాసు సినిమా పూర్తిగా చూసి వచ్చానని ఆవిడ చెప్పింది అబద్ధం. ఆవిడ టిక్కెట్టు కొనుక్కున్నమాట వాస్తవం కాని సినిమాకు వెళ్ళలేదు. రాజు ఆ సినిమాకు వెళ్ళాడు అదేరోజు. ఆ థియేటర్లో ప్రొజెక్టర్ చెడిపోయి ఎనిమిదింటికే అందరినీ పంపించి వేశారు.మరుసటిరోజు ఉచితంగా ప్రదర్శిస్తామని చెప్పిపంపారు. రాజు సినిమా నుంచి వచ్చి ఫోంచేసి మేం మాట్లాడుకుంటూ వుండగా నీ ఫోన్ వచ్చింది. ఈ రెండు కారణాలచేత ఆవిడమీద అనుమానంబలపడింది. రాజుని పంపించి ఆమెను గురించి వివరాలు సేకరించమన్నారు. ముసలి భర్తతో సుఖం దొరకని ఆమె అడ్డదారులు తొక్కింది. భాస్కర్ అనే మెడికల్ రిప్రజెంటేటివ్‌తో సంబంధం పెట్టుకుంది. ఆ రాత్రి సినిమా టిక్కెట్టుకొని సినిమాకు వెళ్ళకుండా ప్రియుని రూమ్‌కు వెళ్ళి పదిగంటలకు యింటికి వెళ్ళింది. భర్తను శాశ్వతంగా వదుల్చుకుంటే ఆస్తిని అనుభవించవచ్చనీ, తన ప్రియుడితో సుఖపడవచ్చనీ ఆత్యాశకు పోయింది. అందుకే తను ఇంటి నుంచి బయలుదేరేముందు, భర్త ప్రతిరోజూ త్రాగే మందుసీసాలో తన ప్రియుడి ద్వారా సంపాదించిన విషాన్ని కలిపింది. ప్రతిరాత్రి ఎనిమిది గంటలకు తనభర్త ఆ మందు త్రాగడం అలవాటుకాబట్టి, తను సినిమాహాల్లో వున్నట్టు ఎలిబీ వుంటుందికాబట్టి, ధైర్యంగా యీ సాహసానికి ఒడిగట్టింది. కాని దోషికి దండన తప్పదు అన్నసూక్తి మరిచి పోయింది. అందుకే పట్టుబడిపోయింది." అని ముగించాడు యుగంధర్!

—ఇ.టి. రామారావు
(శ్రీహరికోట)

**స్రవంతి నెం: 6లో ఇచ్చినవాక్యం**

"హత్యా సమయంలో నువ్వక్కడ లేక పోయినా ఈ హత్య చేసింది నువ్వే" చెప్పాడు డిటెక్టివ్ యుగంధర్ సరళాదేవితో.

**ఆధారంగా రాసిన కథలు**

# హంతకురాలవు నువ్వే!

ఇది చాలా కాలం క్రితం విషయం. యుగంధర్ పూర్ణాలో ఒక పెట్రోలు బంకు యజమాని హత్యకేసు దర్యాప్తు చేస్తున్నప్పటిది.

ఒకనాడు యుగంధర్ ఆఫీసులో ఫోన్ మ్రోగింది.

"హలో! నేను! సరళాఫ్యూయల్ సర్వీసు యజమాని విజయ్ భార్యను మాట్లాడుతున్నాను. నా భర్త హత్యచేయబడ్డాడు. మీరు వెంటనే రావాలి" అని, ఆమె ఒక ఇంటి ఎడ్రస్ చెప్పింది.

* * *

ఇంటిముందు జనం ఉన్నారు. గేటుదాటి యుగంధర్ హత్యజరిగిన ప్రదేశం (గది) చేరుకున్నాడు. శవం ఇంకా చెడిపోలేదు. కడుపులో కత్తిదిగి ఉంది. హతుడు శరీరం మీద దుస్తులు పరిశీలించాడు. యుగంధర్. ఒకసారి గదంతా నిశితంగా పరిశీలించాడు. ఆ గది ఇంటికి ఒక ప్రక్కగా వుంది. కిటికీ తెరచి ఉంది. నేలను చేత్తో తాకి చూశాడు. తన అనుమానం దృఢమైంది. కొద్దిసేపట్లోనే శవం పోస్టుమార్టంకు పంపబడింది.

* * *

యుగంధర్ ఫోన్ ప్రక్కన కూర్చుని ఫోన్‌కాల్ గురించి చూస్తున్నాడు. ఉదయం హత్య జరిగిన స్థలంనుంచి నేరుగా ఊళ్ళో వున్న అన్ని ఐస్‌ఫ్యాక్టరీలు తిరిగాడు. తనకు కావలసిన క్లూ దొరికింది.

ఇంతలో ఫోన్ మ్రోగింది "హలో ఇన్‌స్పెక్టర్ స్పీకింగ్"

"చెప్పండి. నేను యుగంధర్"

"సార్ మీరూహించినది కరెక్ట్, హత్య కత్తిపోటు మూలంగా జరగలేదు. అంతకు ముందు అంటే ఉదయం సుమారు 6.30 నుండి 7 గం॥ మధ్యకాలంలో హతుడు మరణించాడు" అంటూ పోస్టుమార్టం వివరాలు చెప్పాడు.

"అయితే వెంటనే సరళాదేవిని అరెస్టు చేయండి."—

* * *

"నో. ఈ హత్య నేను చేయలేదు. ఆ సమయంలో నేను మా వీధి చివర పాల బూత్ వద్ద వున్నాను. 6-15 తర్వాత అట్నుంచటే గవర్నమెంటువారి షిప్ కేంటిన్‌వద్దకు వెళ్ళాను. అది ఉదయం 8 గం॥ వరకు ఉంటుంది. కావలిస్తే రెండు చోట్ల నిరూపించగలను"- ఆవేశంగా అంది సరళాదేవి.

"కాని మీరూ, మీ ప్రియుడు రాత్రి ఐస్‌ఫ్యాక్టరీనుంచి మంచుగడ్డలు తెచ్చారు. నేను తెలుసుకున్నాను. తెల్లవారి 8 గం॥ ప్రాంతంలో హతుణ్ణి తాళ్ళతో బంధించి చుట్టూ మంచుగడ్డలు పేర్చారు. దాని మూలంగా హతుడు మరణించాడు. చేతి కట్లు చర్మాన్ని కోసేశాయి. పోస్టుమార్టం రిపోర్టు ప్రకారం శరీరంలో కత్తి దిగక ముందే రక్తం ఘనీభవించింది. ఇన్వెస్టిగేషన్ కన్ఫ్యూజింగ్‌గా వుండాలని మీరు అతితెలివి ప్రదర్శించారు. కాని దొరికిపోయారు. అందువలన హత్యాసమయంలో నువ్వక్కడ లేకపోయినా, హత్యచేసింది నువ్వే" చెప్పాడు డిటెక్టివ్ యుగంధర్ సరళాదేవితో.

తర్వాత సరళాదేవి నిజం చెప్పింది. తన ముసలి భర్తంటే తనకు ఇష్టంలేదు. తన ప్రియుడుతో కలిసి సుఖంగా వుండా